సాక్షి ఆదిలాబాద్

సోమవారం । 15 । జనవరి । 2024



చిన్నారులపై భోగి పళ్లు పోస్తున్న కుటుంబ సభ్యులు



'నాగోబా' ప్రచారయాత్ర షురూ

నాగోబా మహాపూజ ప్రచారరథాన్ని కేస్లాపూర్‌లో ప్రారంభించారు. ఉమ్మడి జిల్లా నుంచి మెస్రం వంశీయులు తరలివచ్చి మురాడి వద్ద సమావేశమయ్యారు. 10లో▸

గరిష్టం/కనిష్టం
30.0/14.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. వేకువ జామున పొగమంచు ప్రభావం కనిపిస్తుంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

ముగ్గుల పోటీ



ముగ్గులను పరిశీలిస్తున్న కంది శ్రీనివాసరెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: సంక్రాంతి పండగ పురస్కరించుకొని కేఎస్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రామాలయంలో ఆదివారం ముగ్గుల పోటీ నిర్వహించారు. పట్టణంతో పాటు పలు గ్రామాలకు చెందిన యువతులు, మహిళలు పాల్గొని పండుగ విశిష్టత చాటేలా తీరొక్క రంగులతో ముగ్గులు వేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. అనంతరం విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో పార్టీ కిసాన్‌సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, బ్రాహ్మణ సమాజ్ గాయత్రి మహిళ మండలి అధ్యక్షురాలు స్వరూపరాణి, ప్రియాంక, సుశ్మిత, అశ్విని, లత, సాయి మానరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నగదు రహిత వైద్యం అందించాలి

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వ ఉద్యోగులందరికీ అన్ని కార్పొరేట్, ప్రైవేట్ ఆస్పత్రుల్లో నగదు రహిత వైద్యం అందించాలని జిల్లా ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్.శశికాంత్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం పెన్షనర్లను అనేక విధాలుగా ఇబ్బందులకు గురిచేసిందని విమర్శించారు. ఈ మేరకు కొత్త ప్రభుత్వం పెండింగ్ డీఏల విడుదల, పాత పెన్షన్ విధానం అమలుతో పాటు పెన్షనర్లను ఆదాయ పన్ను నుంచి మినహాయింపు అంశాలపై దృష్టి సారించాలని కోరారు. ప్రతి జిల్లాలో వెల్‌నెస్ సెంటర్లలో అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని, కనీస పెన్షన్ రూ.9వేలు ఉండాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం కార్యదర్శి జగన్మోహన్, గౌరవ అధ్యక్షుడు ఎస్.దయాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు ఎం.గంగాధర్,డి.ఉమాకాంత్, జి.బాపురావు, జి.దేవి దాస్, ఎస్.రాజవర్ధన్, అశోక్ వైద్య, వెంకటస్వామి, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని శ్రీవెంకటేశ్వర ఆలయం (మార్వాడి ధర్మశాల)లో ఆదివారం శ్రీగోదాదేవి రంగనాథ స్వామి కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ స్వామివారి కల్యాణ ఘట్టం చేపట్టారు. భక్తులు భారీగా తరలివచ్చారు.

ఘనంగా శోభాయాత్ర



ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని శ్రీ నీలోమా అడానేశ్వర్ సేవాశ్రమంలో ఈనెల 8నుంచి అడానేశ్వర గ్రంథసప్తాహ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. సద్గురు అడానేశ్వర 37వ మహాసమాధి దినోత్సవం పురస్కరించుకొని ఆదివారం గ్రంథ పారాయణ సమాప్తి కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా పట్ట ణంలో శోభాయాత్ర నిర్వహించారు. అడానేశ్వరుని నామస్మరణ మారుమోగింది. భజన చే స్తూ కీర్తనలు ఆలపిస్తూ భక్తులు ముందుకు సాగారు.

ఆదివాసీ చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలి

బోథ్: ఆదివాసీ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని ఆదివాసీ తెగల సమన్వయకర్త చెంచు రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని పట్నాపూర్ గ్రామంలో ఆదివాసీలతో ఆదివారం సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలనే డిమాండ్‌లో మార్చిలో జోడేఘాట్‌లో నిర్వహించే సమావేశానికి ఆదివాసీ తెగలు పాల్గొనాలని కోరారు. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఆదివాసీ తెగలను జాగృతం చేసేందుకు జన చైతన్య యాత్ర నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం యాత్రకు సంబంధించిన పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో పట్నాపూర్ సర్పంచ్ పంద్రం సుగుణ, న్యాయవాది శంకర్, తదితరులు పాల్గొన్నారు.



సంక్రాంతి

- వైభవంగా భోగి వేడుకలు
- ఇంటింటా పండుగ సందడి



ముగ్గును తీర్చిదిద్దుతున్న మహిళలు

భోగభాగ్యాల భోగి వేడుకలను జిల్లావాసులు ఆదివారం వైభవంగా నిర్వహించుకున్నారు. మూడు రోజుల పండుగలో భాగంగా తొలిరోజు భోగి మంటలతో వేడుకలు షురూ అయ్యాయి. నేడు సంక్రాంతి సంబరాలకు సర్వం సిద్ధం చేసుకున్నారు. సుదూర ప్రాంతాల్లో ఉన్న వారంతా ఇప్పటికే సొంతూళ్లకు చేరుకున్నారు. పల్లె, పట్టణం పండుగ శోభ సంతరించుకుంది. ఉదయం భోగి మంటలు ప్రత్యేక ఆకర్షణగా నిలువగా.. ముంగిళ్లను మహిళలు రంగవల్లులతో తీర్చిదిద్దారు. ఆనవాయితీగా పిల్లలకు భోగి పండ్లు పోసి స్నానాలు చేయించి పెద్దలు ఆశీర్వచనాలు అందించారు. చిన్నారులు, యువకులు గాలి పటాలతో గల్లీల్లో సందడి చేశారు. మహిళలు పిండి వంటలు చేస్తూ బిజీబిజీగా గడిపారు. – ఆదిలాబాద్

సరదాల పండుగ



నార్నూర్: సంక్రాంతి.. సరదాల పండుగ. పిండి వంటలకు ప్రత్యేకత. కుటుంబసభ్యులు, బంధు మిత్రులు, స్నేహితులతో కలిసి పండుగను సంబురంగా జరుపుకుంటాం. ఇళ్లంతా సందడిగా ఉంటుంది. ప్రత్యేక పూజలు చేస్తాము.

– రాథోడ్ జనార్దన్
జెడ్పీ చైర్మన్

అందరికీ శుభాకాంక్షలు



ఆదిలాబాద్‌రూరల్: అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు. సంప్రదాయ పండుగలు, సంస్కృతులను గౌరవిస్తూ భావి భవితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉంది. ఆంగ్ల సంవత్సరంలో తొలిపండుగ సంక్రాంతి. ఈ ఏడాది వర్షాలు సకాలంలో కురిసి పంటలు సమృద్ధిగా పండి రైతన్నలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నా. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పేదలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా నా వంతు కృషి చేస్తా.

– వెడ్మ బొజ్జు, ఎమ్మెల్యే, ఖానాపూర్

Happy Sankranthi



రైల్వేలైన్ సాధన కమిటీ సభ్యులు..

పోరుబాట..

- 'ఆదిలాబాద్–ఆర్మూర్' రైల్వేలైన్ కోసం పిడికిలెత్తిన సాధన కమిటీ
- ఈనెల 16నుంచి రిలే దీక్షలు
- తెలంగాణ ఉద్యమ తరహా కార్యాచరణ
- అమరవీరుల స్తూపం నుంచే పోరాటం



సాక్షి,ఆదిలాబాద్: ఆదిలాబాద్ నుంచి ఆర్మూర్ వరకు రైల్వేలైన్ సాధనే లక్ష్యంగా ఈ ప్రాంతవాసులు పోరుబాటకు సై అంటున్నారు. ఇందుకోసం ఇటీవలే ప్రత్యేకంగా రైల్వేలైన్ సాధన కమిటీ ఏర్పాటు కాగా, ఈనెల 16 నుంచి రిలే దీక్షకు సిద్ధమయ్యారు. తెలంగాణ ఉద్యమ తరహాలో ఆందోళన చేపట్టాలని భావిస్తున్నారు. ఇందుకోసం అన్ని సంఘాలు, మేధావులను కలుపుకుని పోవాలని కృతనిశ్చయంతో ముందడుగు వేస్తున్నారు. అమరవీరుల స్తూపం నుంచే పిడికిలి బిగించేందుకు సన్నద్ధమవుతున్నారు.

సాధన కమిటీ..

ఆదిలాబాద్–ఆర్మూర్ రైల్వేలైన్ సాధన కమిటీని ఇటీవల ఏర్పాటు చేసుకున్నారు. చైర్మన్‌గా కాసవేని నారాయణ,గౌరవఅధ్యక్షులుగా సంద అశోక్, ప్రధాన కార్యదర్శులుగా ఎన్.నరేందర్, ఆర్.పవన్‌రావు, ఇతరులతో కమిటీని ఎన్నుకున్నారు. మండల, గ్రామ, వార్డు కమిటీలను నియమించుకుని ముందుకు వెళ్లాలని భావిస్తున్నారు. ప్రజా, కుల సంఘాలు, మేధావులు, ట్రేడ్‌యూనియన్లు, విద్యార్థి, యువజన, ఉద్యోగ సంఘాలు, అడ్వకేట్లు, డాక్టర్లు, ఇంజినీర్లు, రిటైర్డ్ ఉద్యోగులు ఇలా అందరినీ భాగస్వాములను చేస్తూ ముందుకు వెళ్లాలని నిర్ణయించారు.

కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేలా..

కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేలా ఉద్యమ కార్యచరణ రూపొందిస్తున్నారు. ఈ బడ్జెట్ సెషన్‌లోనే నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం పటాన్‌చెరు నుంచి ఆదిలాబాద్ రైల్వేలైన్ కోసం ఫైనల్ లోకేషన్ సర్వే చేయిస్తుందని, దీని ద్వారా 317 కిలోమీటర్ల లైన్ విస్తరణ ఇప్పుడున్న పరిస్థితుల్లో సాధ్యం కాకపోవచ్చన్న అభిప్రాయం సాధన కమిటీలో వ్యక్తం అవుతుంది. దీనికి కారణం లేకపోలేదు. పటాన్‌చెరు నుంచి పనులు మొదలుపెడితే తెలంగాణతో పాటు కర్ణాటక, ఒడిశా సరిహద్దుల్లో భూసేకరణ త్వరగా కొలిక్కి వచ్చే అవకాశం ఉండదని సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఆదిలాబాద్ నుంచి పనులు మొదలు పెట్టి ఆర్మూర్ వరకు 120 కిలోమీటర్లు లైన్ మొదట నిర్మించేలా ప్రభుత్వ కార్యాచరణ ఉండాలని డిమాండ్ చేస్తున్నారు.


బీజేపీ సర్కార్ దృష్టి సారించాలి..

బీజేపీ సర్కార్ ఆదిలాబాద్–ఆర్మూర్ రైల్వేలైన్ నిర్మాణం విషయంలో దృష్టి సారించాలని డిమాండ్ వ్యక్తం అవుతోంది. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని ఎంపీగా గెలిపించారని, మొన్నటి శాసన సభ ఎన్నికల్లోనూ ఈ పార్లమెంట్ పరిధిలోని నాలుగు నియోజకవర్గాల్లో కమలం పార్టీ ఎమ్మెల్యేలను గెలిపించుకున్నట్లు గుర్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బీజేపీ సర్కార్ ఆదిలాబాద్ నుంచి ఆర్మూర్ లైన్ ఏర్పాటుకే తొలి ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

దశాబ్దాల కల..

రాష్ట్ర రాజధానికి రైల్వేమార్గం అనుసంధానించే విషయంలో ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల ప్రజల ఎన్నో దశాబ్దాల కల. ఆదిలాబాద్ నుంచి వయా నిర్మల్, ఆర్మూర్, కామారెడ్డి మీదుగా హైదరాబాద్‌కు రోడ్డు మార్గంలో వెళ్లాలంటే 300 కిలోమీటర్లు. అదే ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్‌కు రైలు మార్గంలో వెళ్లాలంటే ముందుగా ఇక్కడ మహారాష్ట్రలోని ముత్ఖేడ్ జంక్షన్‌లో ఎంటర్ కావాల్సి వస్తుంది. అక్కడి నుంచి లోకోరివర్సల్ ద్వారా ట్రైన్ తెలంగాణలోని బాసర, నిజామాబాద్ మీదుగా హైదరాబాద్‌కు చేరుకుంటుంది. ఈ ప్రయాణం 411 కిలోమీటర్లు. దీంతోనే ఆదిలాబాద్ నుంచి వయా నిర్మల్, ఆర్మూర్ మీదుగా హైదరాబాద్‌కు రైల్వేలైన్ నిర్మించాలన్నది దశాబ్దాల డిమాండ్. అయితే కేంద్ర ప్రభుత్వం పటాన్‌చెరు, ఆదిలాబాద్ మధ్యలో రైల్వేలైన్ నిర్మాణం కోసం తుది సర్వే కూడా చేపట్టింది. 317 కిలో మీటర్ల విస్తీర్ణంలో రూ.5,706 కోట్ల అంచనా వ్యయంతో దీన్ని నిర్మించేందుకు ప్రణాళిక కూడా సిద్ధమైందని ఎన్నికలకు ముందుకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. అయితే మొదట ఆదిలాబాద్ నుంచే పనులు ప్రారంభిస్తేనే ఈ ప్రాంతవాసులకు త్వరగా రైల్వేలైన్ కల సాకారం అవుతుందని ఆకాంక్ష.

పాలకుల నిర్లక్ష్యంతోనే వెనుకబాటు



వెనుకబడిన గిరిజన జిల్లా అయిన ఆదిలాబాద్ పాలకుల నిర్లక్ష్యానికి గురై ఎలాంటి అభివృద్ధికి నోచుకోకుండా పోయింది. ఈ జిల్లా ఆర్థికంగా, విద్య, వైద్య, ఉపాధి, ఉద్యోగం సాధించాలంటే రైల్వే రవాణా సౌకర్యం చాలా అవసరం. జిల్లా ప్రజల మనుగడ దీంతో ముడిపడి ఉంది. ప్రతి బడ్జెట్‌లో ఏదో ఒక పేచీ పెట్టి ప్రభుత్వాలు నెట్టుకొస్తున్నాయి. అవసరం లేని రైల్వేలైన్‌లు ఇస్తున్న ప్రభుత్వాలు దశాబ్దాలుగా డిమాండ్ చేస్తున్న ఆదిలాబాద్–ఆర్మూర్ లైన్ త్వరితగతిన నిర్మించాలి.

– కాసవేని నారాయణ,
రైల్వేలైన్ సాధన కమిటీ చైర్మన్

'గిరి' ఆరోగ్యంపై ఫోకస్

- ఆదిమ గిరిజనులందరికీ వైద్య పరీక్షలు
- మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి
- నేడు 'పీఎం జన్‌మన్' ప్రారంభం



జిల్లాలో..	
ఆదిమ గిరిజన గ్రామాలు	52
జనాభా	25వేలు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిమ గిరిజన ఆరోగ్యంపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. పీఎం జన్‌మన్ పేరిట వైద్యంతో పాటు విద్య, రోడ్లు, విద్యుత్, గ్యాస్ కనెక్షన్లు, పక్కా గృహాలు, రేషన్, ఆధార్‌కార్డులు అందించేందుకు ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. సోమవారం నుంచి ఇది ప్రారంభం కానుంది. ప్రధానమంత్రి లాంఛనంగా ప్రారంభించనుండగా, జిల్లాలో ఈ కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు ఉట్నూర్‌లోని కేబీ కాంప్లెక్స్‌లో ప్రారంభించనున్నారు. ఆదిమ గిరిజనులు అనేక సమస్యలతో సతమతం అవుతున్నారనే విషయాన్ని గుర్తించిన కేంద్రం వీరి కోసం పీఎం జన్‌మన్‌కు శ్రీకారం చుట్టింది. గిరిపుత్రులకు అవసరమైన మౌలిక వసతుల కోసం చర్యలు చేపడుతోంది. మూడేళ్ల పాటు కార్యక్రమాన్ని కొనసాగించనున్నారు.

జిల్లాలో..

జిల్లాలో 197 హ్యాబిటేషన్లలో ఆదిమ గిరిజనులైన కొలాం, తోటి, చెంచు, గుత్తికోయ తదితర కులాల వారిని అభివృద్ధి చేసేందుకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. జిల్లాలో జనావాసాలకు ఐదు కిలోమీటర్ల దూరంలో 52 గ్రామాల్లో 25వేల మంది జనాభా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ముఖ్యంగా వీరు సికిల్‌సెల్, నిమోనియా, రక్తహీనత తదితర వ్యాధులతో బాధపడుతున్నారు. వీరి ఆరోగ్యంపై శ్రద్ధ కనబర్చనున్నారు. వైద్యారోగ్య శాఖ ద్వారా నెలలో రెండుసార్లు వీరికి వైద్య పరీక్షలు చేయనున్నారు. సికిల్‌సెల్, ఎమియా పరీక్షలు, టీబీ, చిన్నపిల్లలకు వందశాతం ఇమ్యూనైజేషన్, గర్భిణులకు పరీక్షలు చేయనున్నారు. జిల్లాలో 200 మంది వరకు ఆదిమ గిరిజన గర్భిణులు ఉన్నట్లు గుర్తించారు. అలాగే ఎన్‌సీడీ కార్యక్రమంలో భాగంగా అసంక్రమిత వ్యాధులైన బీపీ, షుగర్, క్యాన్సర్ తదితర వ్యాధులకు సంబంధించి పరీక్షలు చేయనున్నారు. ప్రతీ కుటుంబానికి ఆయుష్మాన్ భారత్ కార్డు అందించే విధంగా వైద్యశాఖ చర్యలు చేపడుతుంది.

కార్యక్రమ నిర్వహణకు..

ఈ కార్యక్రమ నిర్వహణ కోసం వైద్యశాఖతో పాటు ఇతర శాఖల అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. వైద్యశాఖ ద్వారా ఐటీడీఏలోని 20 పీహెచ్‌సీల్లో వీరు ఉన్నట్లు గుర్తించారు. ఇందులో నాలుగు నాన్‌ట్రైబల్ పీహెచ్‌సీలు ఉండగా, 16 ట్రైబల్ పీహెచ్‌సీలు ఉన్నాయి. ముఖ్యంగా వీరు ఉట్నూర్, నార్నూర్, ఇంద్రవెల్లి, గుడిహత్నూర్, ఇచ్చోడ, బజార్‌హత్నూర్, సిరికొండ, గాదిగూడ, నేరడిగొండ, భీంపూర్ మండలాల్లో నివసిస్తున్నట్లు గుర్తించారు. వీరిని ఆస్పత్రులకు తరలించేందుకు ఐదు వాహనాలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఐదుగురు స్టాఫ్ నర్సులు, పారామెడికల్ అధికారుల చొప్పున నియమించింది. వీరితో పాటు మెడికల్ ఆఫీసర్లను కూడా నియమించారు.

రక్తహీనతకు చెక్ పడేలా..

ఏజెన్సీ ప్రాంతంలో నివసిస్తున్న వీరు ఎక్కువ శాతం మంది బాలింతలు, గర్భిణులు రక్తహీనతతో బాధపడుతున్నారు. ప్రసవ సమయంలో అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఎక్కువ శాతం మందికి 5 నుంచి 10 శాతం వరకు హిమోగ్లోబిన్ ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రత్యేకంగా వైద్యుల ద్వారా వీరి సంప్రదింపులు, ఉచిత మందులు, వ్యాధి నిర్ధారణ పరీక్షలు, ఆయుష్మాన్ భారత్ ద్వారా రూ.10లక్షల వరకు ఉచిత చికిత్స అందించేందుకు చర్యలు చేపడుతున్నారు. మూడేళ్ల పాటు ఈ కార్యక్రమం నిర్వహించేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. గిరిజనులు ఆరోగ్యవంతంగా ఉండేందుకు మాతా, శిశు మరణాలు తగ్గించేందుకు కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

పకడ్బందీగా అమలు చేస్తాం..



పీఎం జన్‌మన్ కార్యక్రమంలో భాగంగా ఆదిమ గిరిజనులకు అందించే వైద్య సేవలు పకడ్బందీగా చేపట్టడం జరుగుతుంది. జిల్లాకు ఐదు వాహనాలను ప్రభుత్వం కేటాయించింది. సోమవారం ఉట్నూర్‌లోని కేబీ కాంప్లెక్స్‌లో ఈ కార్యక్రమాన్ని జిల్లా ఉన్నతాధికారులతో పాటు ప్రజాప్రతినిధులు ప్రారంభించనున్నారు. ఆదిమ గిరిజనులకు నెలలో రెండుసార్లు వైద్య పరీక్షలతో పాటు ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన కల్పించడం జరుగుతుంది.

– డాక్టర్ నరేందర్ రాథోడ్, డీఎంహెచ్‌వో

గంగాధర్‌కు సన్మానం



సన్మానిస్తున్న కౌన్సిలర్ భరత్

ఆదిలాబాద్‌టౌన్: నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియామకమైన కొండూరి గంగాధర్‌ను ఆదివారం సరస్వతినగర్ పంచముఖ హనుమాన్ రామాంజనేయ కమిటీ సభ్యులు, కాలనీవాసులు సన్మానించారు. నాల్గో తరగతి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. నిర్మల్ మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు, ఆలయ కమిటీ సభ్యులు గంగన్న, శ్రీనివాస్, రాజన్న, దేవిదాస్, అశోక్, కౌన్సిలర్ భరత్ తదితరులు పాల్గొన్నారు.



అయోధ్య అక్షింతలు.. రామయ్య ఆశీస్సులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా శ్రీరామనామ జపం చేస్తోంది. అయోధ్య రాముడి పూజిత అక్షింతలు ఇంటింటికీ పంపిణీ జరుగతున్నాయి. జైశ్రీరాం.. రామలక్ష్మణ జానకీ.. అంటూ ఊరూవాడా, పల్లె, పట్నం అంతా కూడా కాషాయమయం అవుతుండగా శ్రీరామ పూజిత అక్షింతలతో శోభాయాత్రగా మేళతాళాలు, కోలాటాలు, చెక్కభజనలు, శ్రీరామ, హనుమ భజనలతో సాగుతూ ఇంటికీ చేరుతున్న అక్షింతలను మంగళహారతులతో స్వీకరిస్తున్నారు. శ్రీరామ అక్షింతల పంపిణీలో ప్రతిఒక్కరూ తమ బాధ్యతగా అక్షింతల పంపిణీలో భాగస్వామ్యం అవుతున్నారు.

- హారతులతో స్వాగతం పలుకుతూ స్వీకరిస్తున్న భక్తులు
- 15వ తేదీ వరకు ఇంటింటా పంపిణీ పూర్తికి సన్నాహాలు
- అక్షింతలు, ఆలయ చిత్రపటం, విశేష కరపత్రం అందజేత
- శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో పంపిణీ

తీర్థక్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో..

అయోధ్యలో శ్రీరామ జన్మభూమి ఆలయ ప్రాణప్రతిష్ట 22వ తేదీన జరగనుంది. అయితే కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అయోధ్యలో బాలరాముడి వద్ద పూజించిన అక్షింతల వితరణ శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపట్టారు. మంచిర్యాల జిల్లాలో ఈ నెల 1వ తేదీన ఆరంభం కాగా 15వ తేదీ వరకు అక్షింతల పంపిణీ పూర్తి చేసేలా కార్యక్రమం సాగుతోంది. జిల్లాకు మొత్తంగా 35 క్వింటాళ్ల అక్షింతలు వచ్చాయి.

అక్షింతల వితరణ ఇలా..

సంచాలన సమితి సభ్యులు ప్రతీరోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు బృందంగా ఏర్పడి పంపిణీ చేస్తోంది. కలశ ప్రముఖ్ అక్షింతల కలశాన్ని శిరస్సుపై పెట్టుకుని బృందంతో కలిసి ఇంటింటికీ వెళ్తున్నారు. పలువురు మంగళహారతితో స్వాగతం పలుకుతూ అక్షింతలు స్వీకరిస్తున్నారు. అక్షింతలు, శ్రీరామజన్మభూమి మందిర చిత్రపటం, ఆలయ విశేషాలు తెలిపే కరపత్రం అందజేస్తున్నారు. మంచిర్యాల జిల్లాకు వచ్చిన దాదాపు 13 క్వింటాళ్ల అక్షింతల్లో కుమురంభీం జిల్లాకు కూడా పంపించారు. మంచిర్యాల జిల్లాలో సుమారు 3 లక్షల కుటుంబాలకు అక్షింతలు పంపిణీ చేయాలని సంకల్పించిన నేపథ్యంలో ఇప్పటి వరకు దాదాపు 1.80 లక్షల కుటుంబాలకు అక్షింతలు వితరణ చేసినట్లు శ్రీరామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ సమయోజక్‌లు తెలియజేశారు.



ఎస్పీకి అక్షింతలు ఇస్తున్న హిందూ వాహిని సభ్యులు (ఫైల్)



అదనపు కలెక్టర్‌కు అక్షింతలు అందిస్తున్న దృశ్యం (ఫైల్)

ప్రాణప్రతిష్ఠ రోజున తలపై..

అయోధ్య శ్రీరామ పూజిత అక్షింతలు శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇంటింటా పంపిణీ జరుగుతున్నాయి. శ్రీరాముడి పూజిత అక్షింతలు ఈ నెల 22వ తేదీ శ్రీరామజన్మభూమి ఆలయంలో విగ్రహ ప్రాణప్రతిష్ఠ రోజున ఇంటిల్లిపాది ఆ పూజిత అక్షింతలను తలపై వేసుకుని శ్రీరాముడి ఆశీర్వాదం పొందుతూ శ్రీరామ విగ్రహ ప్రాణప్రతిష్ఠలో కూడా భాగస్వామ్యం అయినట్లుగా భావించాలని శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ తెలియజేస్తుంది.

భారీ శోభాయాత్ర

జీవితంలో మళ్లీ చూడబోని శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ రోజున మంచిర్యాల జిల్లా కేంద్రంలో భారీ శోభాయాత్ర తలపెట్టారు. మంచిర్యాల ఐబీ చౌరస్తాలోని హనుమాన్ విగ్రహం నుంచి ఆరంభమయ్యే శోభాయాత్ర వెంకటేశ్వర టాకీస్ మీదుగా గంగారెడ్డి రోడ్, విశ్వనాథాలయం, రైల్వేస్టేషన్ రోడ్, మార్కెట్ రోడ్‌ల మీదుగా జిల్లా పరిషత్ బాలుర పాఠశాల మైదానం వరకు సాగనుంది. ఇక్కడ పాల్గొనే భక్తజనులందరికీ శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠాపన ప్రసాద పంపిణీ వితరణ చేయనున్నారు.

అక్షింతల రూపంలో శ్రీరాముడు...

నిర్మల్: జిల్లాలోనూ అయోధ్యలో పూజించిన అక్షింతల పంపిణీ ఇంటింటా సాగుతోంది. ప్రతి పల్లెకూ.. ప్రతి ఇల్లుకూ చేరుతున్నాయి. రామజన్మభూమి నుంచి పంపిన అక్షింతలను ఆహ్వానిస్తూ.. రాములోరే ఈ రూపంలో తమ ఇంటికి వచ్చినట్లుగా జిల్లావాసులు భావిస్తున్నారు. అయోధ్య నుంచి నేరుగా నిర్మల్ వచ్చిన అక్షింతలను స్థానిక బాగులవాడ సరస్వతి శిశుమందిర్ పక్కన గల రామాలయంలో ఉంచి, అక్కడి నుంచి జిల్లా మొత్తం పంపిస్తున్నారు. జిల్లాలోని విశ్వహిందూపరిషత్(వీహెచ్‌పీ), బజరంగ్‌దళ్, హిందూవాహిని, స్థానిక యువజన, కాలనీ సంఘాలు, ఇతర ఆధ్యాత్మిక సంస్థలూ అయోధ్య అక్షింతల పంపిణీలో భాగమవుతున్నాయి.



మాజీ ఎంపీ నగేశ్‌కు అక్షింతలు అందిస్తున్న సభ్యులు (ఫైల్)

ఇలాంటి అవకాశం జన్మలో రాదు



అయోధ్య శ్రీరామ పూజిత అక్షింతలు పట్టుకుని ఇంటింటికీ తిరుగుతూ పంచే అవకాశం జన్మలో రాదు. ఇది నిజంగా పూర్వజన్మ సుకృతమే. అక్షింతలు, రామమందిర ఫోటోలు, కరపత్రాలను ఇంటింటా అందిస్తూ ఉండగా ప్రతిఒక్కరూ పండుగ వాతావరణంలో మంగళహారతులతో స్వాగతిస్తూ తమకు నీళ్లారబోస్తూ అక్షింతలు స్వీకరిస్తూ ఉంటే శ్రీరాముడే ఈ అదృష్టం తమకు కలిగించినట్లు భావిస్తున్నాం.

– మన్నవ శివపావని, సంచాలన సమితీ సభ్యురాలు

27 గ్రామాల్లో పంపిణీ చేశాం



ఆసిఫాబాద్: ఆసిఫాబాద్ మండలంలోని 27 గ్రామ పంచాయతీల్లో అయోధ్య బాలరాముడి అక్షంతలు పంపిణీ చేశాం. ఈ నెల 16 వరకు అక్షంతల పంపిణీ కొనసాగనుంది. అక్షంతలను పూజా గదిలో, తినే బియ్యంతో పాటు బీరువాలో భద్రపరుచుకోవాలి. వివాహాలు, శుభకార్యాలతో పాటు కొత్త పనులు ప్రారంభించే సమయంలో ఈ అక్షంతలు వినియోగించుకోవాలని పండితులు సూచిస్తున్నారు.జ

– ఇరుకుల్ల ఆంజనేయులు, రామజన్మభూమి తీర్థ ట్రస్ట్, మండల అధ్యక్షుడు

గడప గడపకూ అక్షింతలు



ఆదిలాబాద్‌టౌన్: అయోధ్య శ్రీ రామజన్మ భూమి అక్షింతలను గ్రామాల్లో గడప గడపకూ వెళ్లి పంపిణీ చేయడం జరిగింది. జిల్లా అధికారులు, మందిరాలకు వెళ్లి అక్షింతలను అందించాం. కాలనీల్లో మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈనెల 1 నుంచి 15 వరకు అక్షింతల పంపిణీ కార్యక్రమం చేపట్టగా, 16 నుంచి 21వ తేది వరకు ఆలయ శుద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తాం. ఈ కార్యక్రమాల్లో దుర్గావాహిని, విశ్వహిందూ పరిషత్, హిందూవాహిని, బజరంగ్ దళ్ తదితర హిందూ ఉత్సవ సంఘాలు పాలుపంచుకున్నారు.

– రేఖ రజిని, దుర్గావాహిని ప్రముఖ్, ఆదిలాబాద్

మహద్భాగ్యం



జైశ్రీరాం.. దేశమంతా ఎదురుచూస్తున్న అయోధ్య రామాలయ ప్రారంభోత్సవం సందర్భంగా అక్కడి నుంచి వచ్చిన పూజిత అక్షింతలను అందుకోవడం మహద్భాగ్యం. వీటిని ఇంటింటికే చేర్చే అదృష్టం దక్కడం చాలా ఆనందాన్నిస్తోంది.

–ముప్పిడి రవి, వీహెచ్‌పీ పట్టణాధ్యక్షుడు, నిర్మల్

రామయ్య వచ్చినట్లే



అయోధ్యలో రామాలయ నిర్మాణానికి చేపట్టిన కరసేవకు వెళ్లే అదృష్టం దక్కింది. ఇప్పుడు అదే అయోధ్యలో పూజించిన అక్షింతలను పంపిణీ చేసే అదృష్టం రావడం సంతోషంగా ఉంది. స్వయంగా ఆ అయోధ్య రాముడే తమ ఇంటికి వచ్చాడన్నట్లుగా అక్షింతలను కళ్లకు అద్దుకుని ఇంట్లోకి తీసుకెళ్లి పూజిస్తున్నారు.

– మంచిరాల నాగభూషణ్, శ్రీరామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ జిల్లా కన్వీనర్, నిర్మల్

ఘనంగా జైనుల దీక్షా సమారోహ శోభాయాత్ర



యువతికి నమస్కరిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్



శోభాయాత్రలో పాల్గొన్న మహిళలు, పురుషులు

ఆదిలాబాద్: జిల్లాకేంద్రంలో జైనుల దీక్ష సమారోహ మహోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రథంలో హైదరాబాద్‌లోని సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని జిల్లా కేంద్రంలోని కుమార్‌పేట కాలనీకి చెందిన యువతి ట్వింకిల్ కామ్‌ధార్ పాల్గొన్నారు. జైన మతగురువు రామ్‌లాల్‌జీ మహారాజ్ బోధనలకు ఆకర్షితురాలై సన్యాసం స్వీకరిస్తోంది. ఇందుకు కుటుంబ సభ్యుల అనుమతి తీసుకున్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే పాయల్ శంకర్ హాజరై మాట్లాడారు. యుక్త వయసులో జైన సన్యాసినిగా దీక్షను చేపడుతుండడం అరుదైన విషయమన్నారు. పట్టణ వీధుల గుండా సాగిన శోభాయాత్రలో జైన సమాజ్ మహిళలు, పురుషులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

భోసిలో ఉద్యమ కమిటీ సభ్యుల పర్యటన

తానూరు: మండలంలోని భోసి గ్రామంలో ఆదివారం ప్రత్యేక తెలంగాణ ఉద్యమ రచయిత కమిటీ సభ్యులు పర్యటించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం భోసి గ్రామంలో అమరణ నిరాహార దీక్ష ప్రారంభించిన విషయం తెలిసిందే. దీక్షలో పాల్గొన్న వారి వివరాలను సేకరించేందుకు గ్రంథ రచయితలు జాదవ్ పుండలిక్ పాటిల్, సోమ జనార్దన్‌రెడ్డి, ముథోల్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ రామకృష్ణగౌడ్ గ్రామంలో పర్యటించారు. గతంలో ఇక్కడ కొనసాగిన ఉద్యమ వివరాలను గ్రామస్తులతో అడిగి తెలుసుకున్నారు. త్వరలో నియోజకవర్గ ఉద్యమంపై ముథోల్ తెలంగాణ ఉద్యమ చరిత్ర పుస్తకాన్ని విడుదల చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శివకుమార్, తెలంగాణ ఉద్యమకారుడు రాఘవులు, ఉపాధ్యాయుడు నగేశ్ ఉన్నారు.

19న సపోటా తోట వేలం

ఉట్నూర్‌రూరల్: ఐటీడీఏ పరిధిలోని ఉట్నూర్ ఉద్యాన నర్సరీలో సపోటా తోటను ఈనెల 19న వేలం వేయనున్నట్లు ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ ఓ ప్రకటనలో తెలిపారు. నర్సరీలో 128 సపోటా చెట్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఏడాదిపాటు రెండు పంటలకు కలిపి వేలం ఉంటుందని తెలిపారు. ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం 4 గంటల జరిగే వేలంలో వ్యాపారులు పాల్గొనాలని కోరారు.

ఎడ్లబండిని ఢీకొన్న బైక్

ఉట్నూర్‌రూరల్: ఎడ్లబండిని బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందగా, మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. మండల కేంద్రంలోని సెయింట్‌పాల్ పాఠశాల సమీపంలో ఆదివారం రాత్రి ఈఘటన చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి..మండలంలోని కొత్తగూడ కొలాంగూడ గ్రామానికి చెందిన టేకం చందు, టేకం నక్కుదాసు మండల కేంద్రంలో హమాలీగా పనిచేస్తున్నారు. ఆదివారం ఉట్నూర్ నుంచి బైక్‌పై గ్రామానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న ఎడ్లబండిని ఢీకొనడంతో చందు అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రగాయాలైన నక్కుదాసును స్థానికులు ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు అతన్ని పరీక్షించి ఆదిలాబాద్ రిమ్స్‌కు రెఫర్ చేశారు. కాగా, పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మనోహర్ పేర్కొన్నారు.

యువకుడి అదృశ్యం

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని మణిపూర్ కాలనీకి చెందిన యువకుడు హరీశ్ అదృశ్యమైనట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. కాలనీకి చెందిన స్నేహితులు హరీశ్, నిఖిల్‌లు ఈనెల 9న ఉజ్జయిని వెళ్లారు. దేవుని దర్శనం అనంతరం తిరుగుప్రయాణంలో ఇంటికి వస్తుండగా ముత్ఖేడ్ వద్ద రైల్వేస్టేషన్‌లో అదృశ్యమయ్యారు. తల్లి జయ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

చోరీలకు పాల్పడిన నిందితుల అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలో ఇటీవల చోరీలకు పాల్పడిన పలువురు నిందితులను అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. రవీంద్రనగర్‌కు చెందిన టి.అజయ్, టీచర్స్ కాలనీకి చెందిన మినుగు రాజేశ్వర్, కోలిపురకు చెందిన షేక్ సమీర్‌ను ఆదివారం పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. వీరితోపాటు మరో నిందితుడు ఎజాజ్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. వీరి నుంచి నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. కాగా, వీరు దుర్గానగర్‌లోని రెండు ఇళ్లల్లో చోరీలు, ధోబికాలనీలోని ఓ షాపులో షటర్ పగలగొట్టారని, పంజాబ్ చౌక్‌లో హాజీరమి ట్రేడర్స్, కొమురంభీం చౌక్‌లోని ఓ కిరాణ షాప్‌లో దొంగతనాలకు పాల్పడినట్లు తెలిపారు.

సామాజిక సేవ తృప్తినిస్తుంది

గుడిహత్నూర్: సామాజిక సేవచేయడంలో తృప్తి ఉందని సామాజిక సమరసత వేదిక రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్ అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని సోమార్‌పేట్ ఆదివాసీ కొలాం గిరిజన గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 100 మందికి చీరలు, ధోవతులు, యువతీ, యువకులకు, చిన్నపిల్లలకు నూతన దుస్తులు అందజేశారు. గ్రామస్తులతో కలిసి సంక్రాంతి పండుగ జరుపుకున్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బోరంచ గంగారెడ్డి, ఏకలవ్య ఫౌండేషన్ ట్రస్టీ దిగంబర్, జిల్లా సామాజిక సమరసత కార్యకర్తలు ద్రోణాచార్య, పరమేశ్, రామ్‌రెడ్డి, గంగారెడ్డి, రమేశ్‌రెడ్డి, మెస్రం రాజేశ్వర్, శుభం పాల్గొన్నారు.

సందేశాన్నిచ్చిన సంక్రాంతి ముగ్గు

- సామాజిక మాధ్యమాలకు బానిసగా మారొద్దంటూ..
- చిత్రకారుడు అడ్డిగ శ్రావణ్ వేసిన రంగవల్లి
- పలువురిని ఆలోచింపజేస్తున్న సృజనాత్మక ముగ్గు



సందేశాన్నిచ్చేలా తీర్చిదిద్దిన రంగవల్లి ఇదే

నిర్మల్‌ఖిల్లా: సంక్రాంతి అంటే రంగవల్లులకు పేరు. అయితే ఆ సంక్రాంతి ముగ్గులో విభిన్నతను ప్రదర్శించాలనుకున్నాడు నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన చిత్రకారుడు అడ్డిగ శ్రావణ్ కుమార్.. ప్రస్తుత కాలంలో విద్యార్థులు, యువత వయసు ప్రమేయం, చిన్న పెద్ద తారతమ్యం లేకుండా అందరూ సామాజిక మాధ్యమాలకు బానిసగా మారుతున్నారు. అధికసమయాన్ని వీటికే వెచ్చిస్తున్నారు. ఇదే అంశాన్ని స్థానిక మంజులాపూర్ కాలనీకి చెందిన శ్రావణ్‌కుమార్ తన ఇంటిముందు స్వయంగా వేసిన ముగ్గులో సందేశం రూపంలో అందించాడు. రోడ్డుపై వచ్చిపోయే వారు సందర్శించేలా ''డోంట్ బి అడిక్టెడ్'' అంటూ వేసిన ఈ ముగ్గు పలువురిని ఆకట్టుకుంటుంది. ఈ ముగ్గులో పలు సామాజిక మాధ్యమాలు ప్రతిబింబించేలా తీర్చిదిద్దాడు. ఫేస్‌బుక్, ఇంస్టాగామ్, వాట్సాప్, యూట్యూబ్, ట్విట్టర్, జీమెయిల్, గూగుల్ క్రోమ్ వంటి పలు ఇంటర్నెట్ సోషల్ మీడియాను మితిమీరి వినియోగిస్తూ వాటికే అడిక్ట్ అవుతున్న తీరును ఇలా సృజనాత్మకంగా ప్రదర్శించడం పలువురిని ఆలోచింపజేస్తోంది. చాలామంది విభిన్నరీతిలో ఇచ్చిన సందేశాన్ని ప్రశంసిస్తున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



కాలిన సామగ్రి, వస్తువులు

నార్నూర్: మండలంలోని నాగల్‌కొండలో జాదవ్ హేమంత్‌కు చెందిన ఇల్లు షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాలు.. జాదవ్ హేమంత్, భారతిబాయి దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. హేమంత్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి ఆయన విధుల్లో ఉన్నాడు. ఇంట్లో తన ఇద్దరు కుమార్తెలతో భార్య నిద్రిస్తుండగా అర్ధరాత్రి ఆకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో కేకలు వేస్తూ బయటకు పరుగు తీశారు. గమనించిన చుట్టుపక్కల వారు మంటలార్పగా అప్పటికే ఇంట్లో ఉన్న రూ.2 లక్షల నగదు, నిత్యావసర సరకులు, దుస్తులు, 50 కిలోల కందిపప్పు కాలిబూడిదైంది. ఇంటి నిర్మాణ కోసం బంధువుల వద్ద నుంచి ఒకరోజు ముందే రూ.2 లక్షల నగదు అప్పు తీసుకురాగా, షార్ట్‌సర్క్యూట్‌తో కాలిబూడిదైందని బాధితుడు హేమంత్ కన్నీటి పర్యంతమయ్యాడు. ఆదివారం ఉదయం సంఘటన స్థలాన్ని డిప్యూటీ తహసీల్దార్ అమృత్‌లాల్ పరిశీలించి పంచనామా నిర్వహించారు. ఈ ప్రమాదంలో రూ.3 లక్షల వరకు ఆస్తినష్టం వాటిలినట్లు తెలిపారు. గరీబ్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు బానోత్ జగన్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రూ.3 వేల నగదుతోపాటు 25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. బాధిత కుటుంబాన్ని అధికారులు ఆదుకోవాలని సర్పంచ్ సునీత నారాయణ్, ఎంపీటీసీ కళావతి బాదవత్ కోరారు.

చెప్పుల గోదాం..



దగ్ధమైన చెప్పులు

లోకేశ్వరం: మండల కేంద్రంలో ఆదివారం విద్యుత్‌షాక్‌తో చెప్పుల గోదాం దగ్ధమైంది. మధ్యాహ్నం పొగరావడాన్ని స్థానికులు గమనించారు. గోదాం షెటర్ తాళాన్ని పగులగొట్టి నీటితో మంటలార్పివేశారు. అప్పటికే చెప్పులు, ఇతర సామగ్రి కాలిపోయాయి. వీటి విలువ రూ.2 లక్షలు ఉంటుందని బాధితుడు విఠల్ తెలిపాడు.